# సీతాపతి కధ

సీతాపతికి వివాహం కాక పూర్వం-అంటే సరిగ్గా అయిదు సంవత్సరాల క్రితం చాలా కోరికలు వుండేవి. మనసు నిండా ఎన్నో అందమైన ఊహలు వుండేవి. “నిద్రలో ఎన్నో బంగారు కలలు పండేవి. ఆ అందమైన ఊహలు, బంగారు కలలు మనసులో స్మరించుకొని పొదగటానికి చల్లని సాయంత్రాలు వుండేవి. వెన్నెల రాత్రులుండేవి!

వెన్నెల రాత్రులలో, చల్లని సాయంకాలాలలో అతడు “సోఫియా లారెన్” లాంటి అమ్మాయిని తన ప్రక్క భార్యగా వూహించుకునేవాడు. అతనికి సరిగ్గా అయిదేళ్ళ క్రితం వివాహమయింది.

సత్యవతి తుఫానులా అతని జీవితంలో ప్రవేశించింది! ఆ ధాటికి తట్టుకోలేక అతడు కట్టుకున్న గాలి మేడలన్నీ కూలిపోయాయి. వెన్నెల రాత్రులు. అంతమయిన సాయం సమయాలు, బంగారు కలలు అన్నీ కరిగిపోయాయి.

సత్యవతి సోఫియా లారెన్‌లా వుండదు! కనీసం సావిత్రిలా కూడా వుండదు! సీతాపతికి వివాహ మయ్యాక ఇంటికంటే ఆఫీసులోనే కాలం సుఖంగా దొర్లినట్లు అను భూతి పొందేవాడు! ఆఫీసునుండి ఇంటికి వెళ్తూవుంటే తప్పని సరిగా ఏదో నరకంలోకి వెళ్తూనట్లు ఫీలయ్యేవాడు. కాల క్రమేణా అతని మనసులోని కోరికలన్నీ రూపుమాసి పోయినా ఒక్క కోరిక మాత్రం అతన్ని వదిలి పెట్టలేదు.

సీతాపతి ఉద్యోగంలో చేరిన క్రొత్తలో ఆఫీసు మేనేజరు చేతిని చూశాడు. ఆ చేతికి ఏదో ప్రత్యేక మయిన అందం వున్నట్లు తోచింది. అది ఆయన పెట్టుకున్న వాచీ వలన కలిగిందని గుర్తు పట్టటానికి ఎంతో సేపు పట్టలేదు.

అది "సీకో" వాచీ!

దానివైపు చూస్తూ చూపులు మరల్చుకో లేక పోయాడు.

ఎంత అందంగా వుంది అది!

దట్టంగా మబ్బులు పట్టిన ఆకాశంలో అక్కడక్కడ మినుకు మినుకు మంటూ నక్షత్రాలు మెరుస్తున్నట్లు, నల్లటి

"డయలు" మీద ముత్యాల్లాంటి అంకెలు; హఠాత్తుగా మెరిసి మాయమయ్యే మెరుపులాగ "డయల్" మీద మెరిసే మూడు అర్ధగీతలు, అమావాస్య నాటి ఆకాశాన్ని వెండి చట్రంలో బిగించినట్లు నల్లని "డయల్" చుట్టూ మెరిసే కేసింగు-ఓహ్! అద్భుతంగా వుంది! దాన్ని చూచిన నాటినుండీ జీవితంలో ఏ నాటికైనా అటువంటి వాచీకొని ధరించాలన్న కోరిక చాలా బలంగా నిలిచిపోయింది సీతాపతికి! అది లేని జన్మవ్యర్థమని కూడా అనిపించింది.

తాను కష్టపడి నిలువజేసిన ఆరు వందలతోనూ అయిదు వందల రూపాయలు ఈ వాచీ కోసం ఖర్చుచేయ దల్చుకున్నాడు. అయితే అతనికి ప్రతీ విషయంలోనూ వీర్రాజు అభిప్రాయం తీసుకునే అలవాటు వుంది!!

వీర్రాజుకి లౌక్యం తెలుసునని సీతాపతి అభిప్రాయం!

సీతాపతికి బ్రతకటం తెలియదని వీర్రాజు అభిప్రాయం!!

వీర్రాజుకి ముప్ఫయి అయిదేళ్లు వుంటాయి. అతడు చూడటానికి మాత్రం నలభై ఎనిమిదేళ్ళ మనిషిలా కనిపిస్తాడు! అతని కళ్ళు గద్దకళ్ళల్లాగ, చూపులు బాకుల్లాగ, మాటలు చాకుల్లాగ వుంటాయి. అతని చేతులు ములక్కాడల్లా వుంటాయి. అతని నవ్వు అతి భయంకరంగానూ ముఖం అతి అసహ్యంగానూ వుంటుంది! అతని చూపులు

దొంగ చూపులని అతని మిత్రుల అభిప్రాయం. వీర్రాజుకి మంచి తనం మీద రవంతయినా మంచి అభిప్రాయంలేదు. అతడు రేపటి గురించి ఆలోచించడు. వర్తమానం గడిస్తే చాలు!

వీర్రాజుకి ఉపన్యాసాలు ఇవ్వటం సరదా! మాట్లాడుతూ ఎదుటి మనిషిని ఓడించటం అతని 'హాబీ!' అతడు మాట్లాడుతూవుంటే, వినేవారికి అది రాజకీయ ఉపన్యాసంలా అనిపిస్తుంది! అతని ఆవేశం అంతమయితే కాని వాక్ప్రవాహం ఆగదు. ఈ సంగతి సీతాపతికి తెలుసు!

అయితే తను అయిదు వందలు పెట్టి వాచీ కొనబోతున్నట్లు వీర్రాజుతో చెప్పి అతని సలహా అడిగాడు.

వీర్రాజు ఈ వార్తవిని ముందు ఆశ్చర్యపోయాడు!

తరువాత "నువ్వొట్టి వెర్రిపీనుగవి!" అని అర్థం స్ఫురించేటట్లు పెదిమలు ప్రక్కకు వంచి నవ్వేడు!

ఆ తరువాత సిగరెట్టుతీసి ముట్టించి "సీరియస్‌గా ఆలోచించేడు!

ఆఖరుకు సీతాపతివంక చూసి గొంతుక సవరించుకొని అన్నాడు.

"నీకు జాలార్ పేట తెలుసునా?"

పేరు విన్నాను కాని ఎక్కడుందీ తెలియదు"-అన్నాడు సీతాపతి!

"ఒరే బాబూ నువ్వు ఏ వూర్లో వుంటున్నావ్? విశాఖపట్టణంలో నేనా? ఒప్పేసుకో! అయితే అయిదేళ్ళ నుండీ ఈ పట్టణంలో బ్రతుకుతూ జాలరిపేట తెలియదంటే ఒప్పుకోను, విశాఖ రేవను బియ్యంలో రాళ్ళకంటె బియ్యం ఎక్కువగా ఉన్నాయను! నమ్ముతాను! 'ఎలిజబెత్ టేలర్' నిన్ను ప్రేమించిందని చెప్పు! నమ్ముతాను! ఇంత కాలం నుండి వైజాగ్‌లో వుండి విస్కీ వాసన చూడలేదను నమ్ముతాను! కాని జాలరిపేట ఎక్కడుందో తెలియదంటే ఎలా నమ్ముతానురా బాబూ! జాలరిపేటలో ఏం దొరుకుతాయో తెలుసునా? చేపలుకాదురా బాబూ, సీకో వాచీలు, స్కాచ్ విస్కీ-బుడ్లు! రెండు వందల యాభయి రూపాయలు పారేస్తే అయిదు వందల రూపాయలు విలువచేసే వాచీ దొరుకుతుంది. ఎందుకురా బాబూ డబ్బు పాడుచేస్తావ్? నా మాట విను. మనం కాల్టెక్సులో పనిచేయడంలేదు. కలెక్టర్ ఆఫీసులో పనిచేస్తున్నాం! పదేళ్ళు పనిచేసినా నీ జీతం ఇంతే! ఇందులో నువ్వెప్పుడు మిగులుస్తావ్? ఏ నాటికి ఆ డబ్బు అయిదు వందలవుతుంది? కాబట్టి ఆదర్శాలు, ఆశయాలు పెట్టుకోకు! అవకాశం పాడుచేసుకోకు. కంట్రాక్టరు కనకయ్య ఎలా ఆర్జించేడు? స్మగుల్డు వ్యాపారంలో! హోటేలు నాయుడు ఇంతకు ముందు కిళ్ళీకొట్టులో బ్రతికేవాడు, ఇప్పుడు మూడు మేడలు, నాలుగు కార్లు ఎలా కొన్నాడు? బుడ్డీ వ్యాపారమే! ఇంకా చాలామంది ఎలా ఆస్తులు పెంచుకున్నారను కన్నావ్? అంతా సముద్రం చలవే!

సముద్రాన్ని చూశావా?

నురుగులుకక్కే కెరటాలు అస్తమించే ఎర్రని సూర్యుడు; వీటినే చూశావ్ గాని, ఎప్పుడయినా ఓడల్ని చూశావా? ఆ ఓడల్లోనే విదేశాల నుండి మనకు సరుకంతా వస్తుంది! మనవాళ్ళు జాగ్రత్తగా ఎదురు సన్నాహం వెళ్ళి సముద్రంలోనే సరుకంతా పడవల్లోకి రవాణా చేసుకుంటారు. నువ్వు బొత్తిగా అమాయకపు పీనుగవి! నువ్వు ఈ వూర్లో బ్రతకటానికి ఇంకో రెండు జన్మలెత్తినా పనికిరావు! ఒప్పేసుకో! ఇకనయినా నామాట విను! ఇదుగో ఈ సిగరెట్టు తీసుకో! వుపన్యాసం ఆపి జేబులోనుండి సిగరెట్టు పెట్టెతీసి ఒకటి సీతాపతికి అందించాడు వీర్రాజు!

"ఇప్పుడు నువ్వు కాలుస్తున్న సిగరెట్టు ఏమిటో తెలుసా?" స్మగుల్డు సిగరెట్టు!

ఇది మెయిన్‌రోడ్డు మీద కొన్ని కిళ్ళీషాపుల్లోనే దొరుకుతుంది. అయినా ఎప్పుడు కావలసినా నేను సంపాదించగలననుకో! ఉదాహరణకు నన్నేతీసుకో. నా రూము లోని ట్రాన్సిస్టరు ఎక్కడిది? జపాన్‌ది! నా చేతినున్న వాచీ ఎక్కడిది? స్విస్ మేడ్! నా సిగరెట్ లైటర్ ఎక్కడనుండి వచ్చిందనుకున్నావ్! ఆస్ట్రియా నుంచి! ఇవన్నీ ఈ వూర్లో కొన్నవేరా బాబూ! రేపే జాలరిపేట వెళ్ళు! నేను ఇచ్చిన ఎడ్రసు గల ఇల్లుపట్టుకో! నీకు అక్కడ అన్నీ దొరుకుతాయి!

"తెలివి తక్కువగా వ్యవహరించకు! ఆపైన నీ అదృష్టం!"

సీతాపతి మీద వీర్రాజు మాటలు బాగా పని చేసాయి.

ఆ క్షణంలో వీర్రాజు అతని కంటికి తెలుగు సినిమా లోని హీరోలా కనిపించేడు. తను ఇంతకాలం విశాఖ పట్నంలోవుండి, ఈ సంగతులన్నీ తెలుసుకో లేకపోయి నందులకు ఎంతో చింతించాడు.

*   *   *   *

రాత్రి తొమ్మిది గంటల సమయంలో—

చీకటి నల్లగా అతి భయంకరంగా వుంది. సముద్ర కెరటాలు బలంగా లేచి విరిగి పడుతున్నాయి. విరిగి పోయిన అలల నురగ తెల్లగా మసగ్గా కనుపిస్తోంది. సము ద్రం మీద దూరంగా వున్న స్టీమరులోని దీపాలు నిశ్చలంగా కనుపిస్తున్నాయి.

సీతాపతి రోడ్డుదిగి సముద్రం వైపు నడక ప్రారం భించేడు. పేరు తెలియనిపిట్ట ఏదో అరుస్తూ వెళ్ళిపోతోంది సముద్ర ఘోష రాక్షసి ప్రసవ వేదన అనుభవిస్తున్నట్లుగా చెవులకు సోకుతోంది. కొంతసేపు నడిచి ఒక ఇంటివద్ద ఆగిపోయి గుర్తులన్నీ ఒక్కమాటు జ్ఞాపకం చేసుకున్నాడు

సీతాపతి అక్కడవున్న ఇళ్ళన్నిటి మధ్య ప్రత్యేకంగా విసిరి వేసినట్లువున్న ఇల్లుఅదే! ముందు వేపున చేపల వలలుపరిచివున్నాయి. ఆ ప్రాంతమంతా చేపల కంపుతో నాటుసారా వాసనతో అతి అసహ్యంగా వుంది.

సీతాపతి మనసును క్షణంసేపు పిరికితనం ఆక్రమించింది. గుండె దిటవు చేసుకొని చుట్టుప్రక్కల ప్రాంతమంతా పరికించి మెల్లగా తలుపు తట్టాడు.

కొద్దిసేపట్లో కిర్రుమని తలుపు తెరుచుకుంది. తర్వాత గాజుల చప్పుడు గలగలమని!

"లోపలికి రండి" కాస్త యాసతో కూడిన స్వరం.

సీతాపతి తలదించుకుని "నారాయణ ఇల్లు ఇది కాదా!" అడిగాడు అనుమానంగా.

"ఇదే!"

"అతడు ఇంట్లో లేడా?"

"ఏం! అతడు లేకపోతే రాకూడదా!" ఆమె నవ్వుతోంది. తలఎత్తి చూసేడు సీతాపతి.

లోపలినుండి ప్రసరించే గుడ్డిలాంతరు వెలుగు బయటకు రాకుండా ఆమె అడ్డుగావుంది. చీకట్లో ఆమె ముఖంలో ఏమీ చూడలేకపోయాడు.

ఆమె జడలో తురుముకున్న మల్లెపూల మాల మాత్రం ఆమె భుజాలమీదుగా ముందుకుపడి తెల్లగా కను

పిస్తోంది. ఏదో చవక రకం సెంటు వాసన అప్పటికే అతన్ని ఆక్రమించినట్లు అనిపించింది.

అతనికి ఈ పరిస్థితి కొత్తగా వుంది!

మౌనంగా వెనుతిరిగి రాబోయేడు!

"ఈ ఇంటికొచ్చిన వాళ్ళు కనీసం గంటయినా గడప కుండా తిరిగి వెళ్ళరు. ఈ కనకలత సంగతి జాలరిపేటలో ఎవరినడిగినా చెప్తారు. లోపలికి వచ్చి మంచం మీద కూర్చోండి! నారాయణ వస్తాడు!" ఈసారి ఆమె స్వరం హుందాగా వినిపించింది.

ఆజ్ఞాపించినట్లుగా చెప్పి లోపలికి వెళ్ళి పోయింది కనకలత!

మంత్రముగ్ధుడిలా ఆమెను అనుసరించి లోనికి వెళ్ళి మంచంమీద కూలబడ్డాడు సీతాపతి.

దీర్ఘంగా నిట్టూర్చి గదినాలుగు వైపులా కలయ జూశాడు. ఆ గది అతనికి చవకబారు స్వర్గంలా కనుపించింది.

గోడలకు వివిధ భంగిమల్లో అర్ధనగ్నంగావున్న విలాసినుల ఫోటోలు వేళ్ళాడుతున్నాయి. మంచం తల వైపున గోడకు తగిల్చిన ఉమర్ ఖయ్యాం కేలండరు గాలికి చిరిగిపోయి దీనంగా వేలాడుతోంది.

గదిలో ఒకమూలగా పగిలిన గోడ సందులో గుచ్చిన అగరవత్తులనుండి ధూమకుంవర్తులంగా లేచి గదంతా ఆక్రమిస్తోంది.

మంచం మీద దుప్పటి కాస్త మాసినదే. అయినా సర్దినటు వేసివుంది.

ఆ వాతావరణం అంతా అవగాహనకు వచ్చాక జరగబోయే సంఘటన లీలగా అతనిలో మెదిలింది! ఆ వూహతో అతని మనసు భయానికి లొంగిపోయింది. అక్కడనుంచి లేచి వెళ్ళిపోవాలనుకున్నాడు. కాని అతని కాళ్ళు సత్యాగ్రహం చేశాయి. అందుకే మంచాన్ని అంటి పెట్టుకుని కూర్చుండి పోయాడు.

జేబులోనుండి రుమాలుతీసి నుదుటను పట్టిన చెమటను అద్దుకున్నాడు.

"వీర్రాజు చెప్పిన ఈ నారాయణ ఎవరో త్వరగా వస్తే బాగుండును. తనుడబ్బు ఇచ్చి వాచీ తీసుకొని వెళ్ళిపోవచ్చును!" అనుకున్నాడు మనసుల్లో. అయిదు నిమిషాలు అతి నిశ్శబ్దంగా భయంకరంగా గడిచాయి.

సముద్రపు అలలు విరిగిపడుతున్న శబ్దంతప్ప సీతాపతికి ఇంకేవీ వినిపించటంలేదు.

గూటిలో వుంచిన గుడ్డిదీపం గాలికి కొట్టుకుంటోంది.

కొద్ది సేపట్లో గాజుల సవ్వడి వినిపించింది.

కనకలత లోపలినుండి గదిలోకి వచ్చింది. నేరుగా వెళ్ళి వీధితలుపు గడియపెట్టి సీతాపతి ఎదురుగా వచ్చి నిలబడింది.

ఎదురుగా నిలబడిన కనకలతను చూశాడు సీతాపతి!

ఆమె నెమ్మదిగా నవ్వుతోంది!

తనను ఎగతాళి చేస్తున్నట్లు ఆ నవ్వుకు అర్థం స్ఫురించింది అతనికి! సీతాపతి దీపం వెల్తురులో ఆమెను పూర్తిగా పరకాయించి చూశాడు. కనకలత సన్నగా నాజూగ్గా సన్నజాజి తీవలావుంది. ఆమె కట్టిన పల్చని పూదారంగు నైలాన్ చీర ఆమె శరీరంలోని వంపులను దాచలేక వెలికి తెస్తోంది. కిళ్ళీకి అలవాటు పడిన ఆమె పెదవులు ఎర్రగా, కాస్త మోటుగా వున్నాయి. కాటుక సన్నగా తీర్చిన ఆమె కనురెప్పలు మత్తుగా వాలివున్నాయి. ఆ కనులలోని మత్తును తప్పించుకొని దూరంగా పారిపోవడం ఏ మొగాడికీ సాధ్యం కాదేమో ననిపించింది. ఆమె మెడలోని తెల్లని పూసల గొలుసు వదులుగా రొమ్ముల మీద వేలాడుతోంది. చెవులకు ధరించిన రింగులు మెరుస్తూ తమాషాగా కదుల్తున్నాయి.

అర్ధ నిమిషం సేపు ఆమెను తదేకంగా చూశాక ఆలోచనలు మళ్లీ పనిచేయటం ప్రారంభించాయి. త్వరలో జరగబోయేది ఏమిటో అతనికి పూర్తిగా అర్థమయింది.

"మంచి నీళ్లుకావాలా?" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగింది కనకలత.

"అబ్బే...అక్కరలేదు" మాటలు తడబడ్డాయి.

కనకలత మళ్లీ నవ్వింది!

అలా నవ్వుతూనే వచ్చి అతని ప్రక్కనే మంచం మీద కూర్చుంది.

సీతాపతి కాస్త ప్రక్కకు జరుగుదా మనుకున్నాడు కాని అతని మగతనం అందుకు అడ్డునిల్చింది.

కనకలత సుతారంగా అతని చేతులను మెత్తని తన చేతుల్లోకి తీసుకుంది.

ఆ స్పర్శతో అతనిలో ఏదో నూతనత్వం ప్రవేశించి నట్లయింది. ఒత్తిడి అతనిలో అధికమయింది. తనలో విచిత్ర మైన మార్పు కలుగుతోందని క్షణంసేపు అతనికి అని పించింది. అతనిలోని నిగ్రహశక్తి ఎక్కడికో పారిపోయింది.

అతని భుజాలమీద కనకలత శరీరం వాలిపోయింది.

గూటిలోని గుడ్డిదీపం గాలికికొట్టుకొని చివరకు ఆత్మార్పణ చేసుకొంది. సీతాపతి ఆ క్షణాల్లో మరో మనిషి అయిపోయాడు. అగ్గంకాని ఆవేశం; మత్తు అతన్ని పూర్తిగా ఆక్రమించు కున్నాయి. ఒక మెత్తని శరీరం, ఒక తియ్యని స్పర్శ, ఒక వేడి వూపిరి అతణ్ణి చుట్టుముట్టి శరీరం మీద దాడి చేయటం వలన అతడు స్పర్శ జ్ఞానం కోల్పోయాడు. ఆమె జడలోని మల్లెల వాసన అతని ఆలోచనా శక్తిని కట్టి పడేసింది.

సీతాపతి ఆ అనుభవానికి పూర్తిగా లొంగి పోయాడు. అందుకే అతనికి ఆ క్షణంలో, అదొక్కటే

శాశ్వత మనిపించింది. ఏదో ఎత్తునుండి, ఉన్నత శిఖరం నుండీ జారిపోయి పతనమయి పోయినట్లు క్షణంసేపు లీలగా అనిపించినా ఆ ఊహ అట్టేసేపు అతనిలో చోటుచేసుకో లేకపోయింది.

సత్యవతినుండి అంతవరకూ పొందలేనిది ఏదో ఆ క్షణంలో కనకలత వద్ద లభించి నట్లయింది. అందుకే ఆ స్వర్గాన్ని కాదనలేక పోయాడు.

*    *    *    *

తెల్లవారు ఝామున మసక చీకటిలో ఇంటికి కాళ్ళీడ్చు కుంటూ తిరిగి వచ్చిన సీతాపతికి తను వాచీ కోసం తీసు వెళ్ళిన రెండు వందల యాభయి రూపాయలు తనజేబులో లేవని తెలుసుకోటానికి ఎంతోసేపు పట్టలేదు.

ఆ దినం నుండి అతనికి "సీకో" వాచీ కొనాలన్న కోరిక మాత్రం దూరమయింది.

[ఆంధ్రజ్యోతి